స్వామివారి దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు

రాజన్నకు శ్రావణ శోభ

వేములవాడ టౌన్, ఆగస్టు 23: వేములవాడ రాజన్న ఆలయానికి శ్రావణ మాస శోభ సంతరించుకున్నది. వేకువజాము నుంచే భక్తులు కోడెమొక్కు చెల్లించుకున్నారు. రెండు గంటలపాటు క్యూలో నిలబడి ఆది దంపతులను దర్శించుకున్నారు. వివిధ ఆర్జితసేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.18లక్షల ఆదాయం సమకూరగా, స్వామివారిని దాదాపు 30వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని రాజన్న ఆలయ అధికారులు వెల్లడించారు.

ప్రిన్సిపాల్ కేదారేశ్వర్‌కు సన్మానం

ప్రిన్సిపాల్ కేదారేశ్వర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కోనరావుపేట, ఆగస్టు 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేదారేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి హైదరాబాద్‌కు బదిలీ కాగా, సిరిసిల్ల బాలుర కళాశాల నుంచి కేదారేశ్వర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

పూర్వ విద్యార్థుల చేయూత

కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌ను చూపుతున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట, ఆగస్టు 23: కనగర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు (1996-97లో ఎస్సెస్సీ బ్యాచ్) చేయూతనందించారు. పాఠశాలకు రూ.50వేల విలువైన కంప్యూటర్, స్కానర్, ప్రింటర్‌ను వితరణ చేశారు. పూర్వ విద్యార్థులను హెచ్ఎం వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ రూరల్, ఆగస్టు 23: ఆరెపల్లి గ్రామానికి చెందిన నడిగోట్ల ప్రజ్వల్, శాత్రాజుపల్లికి చెందిన తడుక రాజేశం మృతిచెందగా, వారి కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఇక్కడ నాయకులు నల్ల సతీశ్‌రెడ్డి, గుండెకార్ల నరేశ్, గడ్డం నరేశ్, ఇటిక్యాల రాజు, ఆనందరెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, వంశీ, పరశురాములు, మల్లేశం, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

విలీన గ్రామాలు జీపీలుగా మారేనా!

- కాంగ్రెస్ నేత కేకే బాండ్ పేపర్ హామీ నెరవేరేనా?
- మాజీ మంత్రి కేటీఆర్ సూచనతో ఇప్పటికే సిరిసిల్ల మున్సిపల్‌లో తీర్మానం
- ఇటీవలే సీఎంకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ
- అయినా పట్టించుకోని సర్కారు
- పంచాయతీ ఎన్నికలో నేపథ్యంలో పోరుబాటలో విలీన గ్రామాల ఐక్య వేదిక నేతలు

సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమైన ఏడు గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మార్చాలంటూ విలీన గ్రామాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విలీన గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామంటూ బాండ్ పేపర్‌పై హామీఇచ్చారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సైతం విలీన గ్రామాల ప్రజల మనోభావాలకు అనుగుణంగా తిరిగి గ్రామ పంచాయతీలుగా చేస్తామని మాట ఇచ్చి ఇందుకు అనుగుణంగా మున్సిపల్ కౌన్సిల్‌లోనూ తీర్మానం చేయించారు. ఇటీవలే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం సిరిసిల్ల, వేములవాడ మున్సిపాల్టీలో విలీనమైన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మార్చాలని సీఎంకు లేఖ రాశారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో విలీన గ్రామాల ఐక్యవేదిక నాయకులు ఆందోళనలు చేస్తున్నారు.

- రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల రూరల్

విలీన గ్రామాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న పెద్దూర్ గ్రామ ప్రజలు (ఫైల్)

సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమైన గ్రామ పంచాయతీల వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. 2018లో అప్పటి ప్రభుత్వం జిల్లాల పునఃవ్యవస్థీకరణ నేపథ్యంలో సిరిసిల్ల రూరల్ మండల పరిధిలోని తంగళ్లపల్లిని మండల కేంద్రంగా చేసింది. సిరిసిల్ల పట్టణాన్ని అనుకొని ఉన్న రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్ గ్రామాలను సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేసింది. 2019 జనవరిలో ఏడు విలీన గ్రామాలను కలుపుకొని మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. మరో ఏడాది పాటు మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం ఉన్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఏకంగా విలీన గ్రామాలను మళ్లీ గ్రామ పంచాయతీలుగా మార్చుతామని బాండ్ పేపర్ రాసి ఇచ్చి హామీఇచ్చారు. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ సైతం ప్రచారంలో ప్రజలు కోరుకుంటే గ్రామ పంచాయతీలుగా మార్చుతామని ప్రకటన చేయడంతో విలీన గ్రామాల్లో ఆశలు చిగురించాయి.

తీర్మానం చేసినా.. పట్టించుకోని సర్కారు

ప్రజల అభిష్టం మేరకు విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మార్చుతామని అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా.. ఇచ్చిన మాట ప్రకారం విలీన గ్రామాలను పంచాయతీలుగా ఏర్పడిలే కృషి చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఆయన సూచన మేరకు విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మార్చాలని మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. ఐదు నెలలు గడుస్తున్నా సర్కారు నుంచి సమాధానం రాలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన బాటపట్టారు. రోజుకో గ్రామంలో నిరసన, ధర్నాలు, ర్యాలీలు చేసి పోరాటాన్ని ఉధృతం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం విలీన గ్రామాలకు మద్దతు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడలోని గ్రామాలను ప్రజల కోరిక మేరకు పంచాయతీలుగా మార్చాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. అయినా స్పందన లేదు. ప్రభుత్వం పట్టించుకున్నా దాఖలాలు లేవు.

అర్బన్ మండలంగా సిరిసిల్ల

సిరిసిల్ల మున్సిపల్ విలీన గ్రామాలతో కలిపి సిరిసిల్ల అర్బన్‌ను మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు ఆస్తి, ఇంటి పన్నుల భారం తక్కువగా ఉండేది. ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలు ఉపాధి పొందేవారు. ఇంటి పర్మిషన్, ఇంటి పన్నులు భారం ఎక్కువ ఉండడం, ప్రతి పనికి మున్సిపల్‌కు వెళ్లడంతో ఇబ్బందిపడుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలుగా మారితే పాత రోజుల వస్తాయని, ప్రజాప్రతినిధులు సేవలందిస్తారని వారు భావిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నం

గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు పనులన్నీ చేసుకున్నం. మున్సిపాల్టీలో విలీనం చేసినంక ఇబ్బందిపడుతున్నం. ఇంటి పర్మిషన్ కావాలంటే రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నం. గుంట జాగలో ఇల్లు కట్టుకోవాలంటే గ్రామ పంచాయతీలో వేలల్లో అయ్యేది. మున్సిపాల్టీలో రూ.లక్షన్నర ఫీజు వసూలు చేస్తున్నారు.

- ఆదిపల్లి నారాయణ, మాజీ ఉప సర్పంచ్ (పెద్దూరు)

పన్నులు భారమైతున్నయ్ ..

పేదలు ఇల్లు కట్టుకోవాలంటే పర్మిషన్ కోసం రూ.లక్షన్నర ఎక్కడి నుంచి కడతరు. చిన్న గుడిసె వేసుకున్న వచ్చి కూల్చివేస్తున్నరు. ఉపాధి హామీ బందయ్యింది. పేదలు ఎట్ల బతుకుతరు. ఈ మున్సిపాల్టీ వద్దు. మాకు పంచాయతీలే ముద్దు అనే నినాదంతో ఆందోళన చేస్తున్నం. సాధించే వరకు ఐక్య వేదిక పోరాటం కొనసాగుతుంది.

- నలేంద్రి బాలరాజు, విలీన గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు పెద్దూరు

హత్యాయత్నం కేసులో పలువురికి ఏడాది జైలు

రుద్రంగి, ఆగస్టు 23: హత్యాయత్నం కేసులో నలుగురికి ఏడాది జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల గ్రామానికి చెందిన రావుల బాలకిషన్, రావుల దేవ, రావుల రఘుతో గ్రామానికి చెందిన రావుల వెంకటేశ్, రావుల కొండయ్య, రావుల నర్సయ్య, వట్టెంలకు చెందిన మర్రి తిరుపతితో కొన్నేండ్లుగా భూతగాదాలు ఉన్నాయి. 27జనవరి 2022లో బాలకిషన్, దేవ, రఘు వారి పొలం వద్ద పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పక్క పొలం రైతులైన వెంకటేశ్, కొండయ్య, నర్సయ్య, మర్రి తిరుపతి మరణాయుధాలతో వచ్చి రావుల బాలకిషన్‌పై కత్తితో దాడి చేశారు. తీవ్ర గాయాలైన బాలకిషన్‌కు రుద్రంగి ఠాణాలో ఫిర్యాదు చేయగా వెంకటేశ్, కొండయ్య, నర్సయ్య, తిరుపతిపై అప్పటి సీఐ శ్రీలత కేసు నమోదు చేసి, కోర్టులో చార్జీషీట్‌లో దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో రావుల వెంకటేశ్, రావుల కొండయ్య, రావుల నర్సయ్య, మర్రి తిరుపతికి ఏడాది సాధారణ జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అలాగే 27జనవరి 2022లో ఇదే కేసులో ఇదే రావుల బాలకిషన్, రావుల దేవ, రావుల రఘు రావు గొడ్డలితో దాడి చేయగా రావుల వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రావుల కొండయ్య ఠాణాలో ఫిర్యాదు చేయగా, బాలకిషన్, దేవ, రఘును అప్పటి ఎస్ఐ విజయ్ రిమాండ్‌కు తరలించి చార్జీషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో బాలకిషన్, దేవ, రఘుకు ఏడాది సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీ రాధిక జైస్వాల్ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పీపీ లక్ష్మణ్, సీఎంఎస్ ఎస్ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కానిస్టేబుల్ మధుసూదన్‌ను ఎస్పీ అభినందించారు.

నేడు ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 23: బోయినపల్లి మండలం మాన్వాడలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి శనివారం ఎల్ఎండీ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎస్సారార్‌లో 17.78టీఎంసీలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. ప్రాజెక్టు గేట్ల ముందుభాగం, వాగు సమీపంలో విద్యుత్ మోటర్లు ఉంటే రైతులు వెంటనే తీసివేసి గడ్డపై పెట్టుకోవాలని అప్రమత్తం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సమాచారం అందించారు. ఏ క్షణమైనా మళ్లీ ఉన్నతధికారులు నుంచి ఆదేశాలు రావచ్చని తెలిపారు.

పాదలు తొలగిస్తూ.. చెత్త తీసివేస్తూ..

- దుమాల 'గురుకులం'లో పారిశుధ్య పనులు
- 'నమస్తే' కథనానికి స్పందన

దుమాల గురుకులంలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు23: దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులపై ఎలుకలు దాడిచేశాయి. ఈ క్రమంలో 'ఎలుకలు కొరుకుతున్నయ్' శీర్షికన నమస్తే తెలంగాణలో బుధవారం కథనం ప్రచురితమైంది. బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశానుసారం గురుకుల పాఠశాలలో శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. పొదలను తొలగిస్తూ, చెత్తను తీసివేశారు. పాఠశాల సిబ్బంది సహకారంతో చెత్తాచెదారాన్ని తొలగించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 23: తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ పరిధిలోని చింతలపల్లిలో శుక్రవారం పోచమ్మ ఆలయ నిర్మాణానికి నాయకులు భూమి పూజ చేశారు. ఇక్కడ మాజీ సర్పంచులు వల కొండ వేణుగోపాలరావు, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, మాజీ వైస్ఎంపీపీ జంగిటి అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎల్ వోసీ అందజేత

ముస్తాబాద్, ఆగస్టు 23: మద్దికుంటలోని పేద కుటుంబానికి చెందిన సుంచు రాజు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సదరు కుటుంబ దీనస్థితిని ముస్తాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత ఏళ్ల బాల్‌రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తెలియజేయడంతో రూ.2.5లక్షల ఎల్‌వోసీ మంజూరైంది.

గిరిజన విద్యార్థికి డాక్టరేట్

వీర్నపల్లి, ఆగస్టు 23: గర్జనపల్లికి చెందిన భూక్యా బన్సీ కుమారుడు మహిపాల్ డాక్టరేట్ పొందాడు. మాలవ్య నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జైపూర్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. మహిపాల్‌ను గ్రామస్తులు అభినందించారు.

తప్పతాగి.. విధులకు హాజరు

వేములవాడ టౌన్, ఆగస్టు 23: రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న వంట మనిషి శుక్రవారం తప్పతాగి విధులు నిర్వర్తించాడు. నివేదన తొందరగా చేసే క్రమంలో మాడిపోయింది. దీంతో స్వామివారికి సమర్పించే నివేదన ఆలస్యం కావడంతో క్యూలో నిలబడ్డ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వికటించిన టీకా

సౌదీలో జగిత్యాల జిల్లా వాసి యువకుడి నరకయాతన

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి అస్వస్థతకు గురై నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతోపాటు టీకా వేయించుకున్నాడు. ఢిల్లీలోని హెచ్ఆర్ ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జాబ్ వీసాపై జూలై 11న సౌదీ అరేబియాలోని ఆల్-బాద్ తాబూక్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల తర్వాత టీకా తీసుకున్న కుడి భుజానికి ఇన్ఫెక్షన్ అయింది. మెరుగైన చికిత్స కోసం స్వదేశానికి పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదన వ్యక్త చేసింది. తిరిగి స్వదేశానికి అత్యవసరంగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీవోఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది.

రాజన్న ఆలయంలో కొనసాగిన ఏసీబీ తనిఖీలు

వేములవాడ, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో ఏసీబీ అధికారుల తనిఖీలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. గురువారం 20 మంది ఏసీబీ అధికారుల బృందం 12 గంటల పాటు తనిఖీ చేయడంతోపాటు రికార్డు చేయగా, రెండోరోజు పది మంది అధికారులు స్వామివారికి సంబంధించిన లీజులు, పలు విభాగాల టెండర్లు, నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన పలు రికార్డులను 4 గంటలపాటు పరిశీలించారు. లడ్డూ ప్రసాదాల తయారీ, విక్రయాలు, గోదాం నిల్వలు, లీజుల టెండర్లు, వసతి గదుల సముదాయాలు, నిత్యాన్నదానం తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసినట్టు తెలిసింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
దమ రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండరు కోరుతూ ప్రకటన
(http://ireps.gov.in ద్వారా)

దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.01 **NIT No: C/E.29/TRD/SC/23/2024-25, పని పేరు:** టెండరు నం. C/E.29/TRD/ SC/ 23/ 2024-25, తేది: 20-08-2024. SC డివిజన్: PDPL-NZB: పెద్దపల్లి జంక్షన్-లింగంపేట జగిత్యాల సెక్షన్‌పై యాంటి మంకీ క్లైంబింగ్ డివైస్ ఏర్పాటుచేయుట. **అంచనా వ్యయం: రూ. 26,13,712/-, పూర్తి చేయు కాలం:** 90 రోజులు, **ముగింపు తేది:** 16-09-2024న, 15.00 గం.

1) బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ http:// ireps.gov.in కు లాగిన్ కాగలరు.
2) టెండరుదార్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) టెండరు ఫారం ధర & బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరు దారులందరు కోరబడుచున్నారు.
4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందవల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయవల్సిందిగా కాగోరు టెండరు దారులందరు కోరబడుచున్నారు.
5) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణల (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీ చెయ్యబడును) కొరకు గమనించగలరు.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ / TRD/సికింద్రాబాద్
A1061

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

రాజంపేట్, ఆగస్టు 23: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం అన్నారం తండాలో శుక్రవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి(33) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన తిరుపతికి.. పక్కనున్న పొలానికి కరెంట్ సరఫరా కోసం తీసుకున్న వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వేతనాల కోసం అంగన్‌వాడీల ధర్నా

కామారెడ్డి, ఆగస్టు 23: వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ నిర్వాహకులు శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు.

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ అధికారాన్ని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోలకు కట్టబెట్టడం చెల్లదని స్పష్టం చేసింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారాన్ని అప్పగిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఐటీడీఏ పీవోల వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ సూట్లను కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఒక సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను పరిశీలించేందుకు చేతిరాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీచేయడంపై హస్సాపూర్ గ్రామానికి చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ కే శరత్ శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు.

అన్నలు నా బిడ్డ జీవితాన్ని నాశనం చేశారు

- ఏడేండ్లు సేవ చేయించుకొని హతమార్చారు
- భోరున విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు

కాప్రా, ఆగస్టు 23: 'అమ్మా, నాకు ఉద్యోగం దొరకబోతోంది, త్వరలోనే మన కష్టాలు తీరుతాయి' అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ ఇం